

ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఏకాంబరం. ఐరాల మండలం పుల్లూరు. పుట్టుకతో కాళ్లు చచ్చుపడిపోయి పోలియోతో బాధ పడుతున్నాడు. 1975వ సంవత్సరం నుంచి పింఛన్ తీసుకుంటున్నాడు. ఇటీవల కూటమి ప్రభుత్వం రీవెరిఫికేషన్ అని చెప్పడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ఆయనను పరిశీలించి వైకల్యం 85 శాతం అంటూ నమోదు చేశారు. గతంలో సదరం సర్టిఫికెట్‌లో 90 శాతం వైకల్యం ఉండగా, ప్రస్తుతం 5 శాతం తగ్గించారు. దీంతో ఏకాంబరానికి రూ.15 వేల పింఛన్ తొలగించి రూ.6 వేల పింఛన్‌కు నోటీసు అందజేశారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు సుమతి. ఐరాల మండలం రామవనం తోపులో నివాసం ఉంటోంది. పుట్టుకతో కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. కర్రల సాయంతో నడిచే పరిస్థితి. ఈమెకు ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి పింఛన్ తీసుకుంటోంది. సుమతిని కుటుంబ సభ్యులు కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రీవెరిఫికేషన్ పేరిట ఈమెకు వికలత్వం 85 శాతం ఉన్నట్లుగా కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. గతంలో అందే రూ.15 వేల పింఛన్‌ను రూ.6 వేలకు తగ్గించేసింది.

దివ్యాంగులపై ఎందుకీ నిర్దయ?

ఎన్నికల సమయంలో పింఛన్ల నగదు పెంచుతామని చెప్పి.. అర్హులైన వారికి కొత్త పింఛన్లు ఇస్తామని బీరాలు పలికి.. తీరా ఇప్పుడు పుట్టుకతోనే వైకల్యం, ప్రమాదాల్లో కాళ్లు చేతులు కోల్పోయి దివ్యాంగులుగా మారిన వారి పింఛన్లు తొలగించిన కూటమి ప్రభుత్వంపై ఆగ్రహ జ్వాలలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వ చర్యలు దివ్యాంగుల పాలిట శాపాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 15 నెలలు కావొస్తున్నా ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేసిన పాపానపోలేదు. ప్రభుత్వం ఎప్పుడూ కొత్త పింఛన్లను మంజూరు చేస్తుందా ? అని ఎదురు చూస్తున్న వారెందరో ? ఇది ఇలా ఉంటే దివ్యాంగులపై కనీస కనికరం లేకుండా పింఛన్లను తొలగించి వారిని రోడ్డున పడేస్తుండడంతో వారు శాపనార్థాలు పెడుతున్నారు.



ఎంపీడీఓ ధనలక్ష్మితో మాట్లాడుతున్న దివ్యాంగులు

- కాళ్లు, చేతులు లేని దివ్యాంగులపై ప్రభుత్వానికి ఎందుకింత కక్ష ?
- పింఛన్ల తొలగింపుతో రోడ్డున పడుతున్న దివ్యాంగులు
- అర్హత ఉన్నా వైకల్యం తక్కువగా ఉందని నోటీసులు
- మరికొందరికి పింఛన్ నగదు తగ్గింపు
- పూతలపట్టు నియోజకవర్గంలో 1,292 పింఛన్ల కట్
- కార్యాలయాల చుట్టూ దివ్యాంగుల పాట్లు

ఐరాల : కూటమి ప్రభుత్వం పింఛన్ల ఏరివేతకు కుట్రలు పన్నింది. అందులో భాగంగా రీవెరిఫికేషన్ అని కొత్తరాగం అందుకుంది. అందుకోసం కొందరు డాక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లి అంగవైకల్యంతో బాధపడుతూ పింఛన్ పొందుతున్న దివ్యాంగుల గొంతు నొక్కేసినట్లు అవుతోంది. ఏదో వంక చూపిస్తూ వారికి వచ్చే పింఛన్‌లో కోత పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మేరకు నియోజకవర్గంలో 1,292 మంది దివ్యాంగులకు నోటీసులు అందజేశారు. దీంతో వారంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల దివ్యాంగ పింఛన్ల రీవెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టారు. చాలామందిని అనర్హులుగా తేల్చి నోటీసులు అందజేశారు. పింఛన్లు తొలగించారనే నోటీసులు అందుకున్న లబ్ధిదారులు సచివాలయాలకు వెళ్తే ఆస్పత్రికి వెళ్లమని, ఆస్పత్రిలో డాక్టర్లు తమకు తెలియదంటూ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైకల్యంతో బాధ పడుతూ ప్రభుత్వం ఇచ్చే నగదుపైనే ఆధార పడి కాలాన్ని నెట్టుకొస్తున్న తరుణంలో పింఛన్ తొలగింపుతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి తీసుకుంటున్న పింఛన్లను అకారణంగా తొలగించడంపై ఏమి చేయాలో దిక్కు తెలియక న్యాయం చేయలంటూ దివ్యాంగులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ప్రసాద్. ఐరాల మండలం చిన్నసామిరెడ్డిపల్లెలో నివాసం ఉంటున్నాడు. పుట్టుకతోనే దివ్యాంగుడు. రెండు కాళ్లు పూర్తిగా సహకరించవు. గతంలో సదరం క్యాంపునకు వెళ్లినప్పుడు 90 శాతం ఉన్నట్లు గుర్తించి సర్టిఫికెట్ ఇచ్చారు. ఇటీవల కూటమి ప్రభుత్వం రీవెరిఫికేషన్ నిర్వహించింది. సచివాలయం సిబ్బంది ఇచ్చిన సర్టిఫికెట్‌లో 85 శాతం ఉన్నట్లు ఇచ్చారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రసాద్ ప్రశ్నిస్తున్నాడు. 90 శాతం వైకల్యం ఉంటే రూ.15 వేల పింఛన్ సొమ్ము ఇవ్వాల్సి ఉంటుంది. కానీ కూటమి ప్రభుత్వం రూ.6 వేల పింఛన్‌గా మార్పులు చేయడం గమనార్హం.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు పరదేశి. యాదమరి మండలం భూమిరెడ్డిపల్లెలో నివాసం ఉంటున్నాడు. గత 20 ఏళ్లుగా కాలు పనిచేయక పోవడంతో అచేతనంగా ఉండాల్సిన పరిస్థితి. కుటుంబ సభ్యుల సహాయం లేకపోతే కూర్చోలేడు.. పడుకోలేడు.. ఆయన భార్య కూలీ పనులు చేస్తూ కుమార్తెకు వివాహం చేసింది. ప్రస్తుతం కుమార్తె కూడా తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. పరదేశికి వచ్చే పింఛన్ సొమ్ముతో మందులకు, కుటుంబ ఖర్చులకు ఆసరాగా ఉండేది. 90 శాతం వైకల్యంతో రూ.15 వేల పింఛన్ వస్తుండేది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో అతని పేరు గల్లంతైంది. ఎన్నో ఏళ్ల నుంచి తీసుకుంటున్న పింఛన్ తొలగించడం శోచనీయం.

కాస్త దయ చూపండి సామీ..



యాదమరి: దివ్యాంగుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న డాక్టర్ అనిల్

యాదమరి: ఇప్పటి వరకు ప్రభుత్వం అందించే పింఛన్ సొమ్ముతోనే బతుకీడుస్తున్న తమకు.. ''ఇప్పుడు రీవెరిఫికేషన్ పేరట బతుకులు బుగ్గిపాలు చేయవద్దు.. కాస్త కనికరించండి సారూ'' అని వైద్యాధికారుల ఎదుట దివ్యాంగులు కన్నీటితో వేడుకున్నారు. ఈ హృదయ విదారక సంఘటన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కనిపించింది. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి యాదమరి, మాదిరెడ్డిపల్లి పీహెచ్‌సీ వైద్యులు డా.అనిల్‌కుమార్, వరప్రసాద్ ఆధ్వర్యంలో రీవెరిఫికేషన్ చేశారు. మండలవ్యాప్తంగా నోటీసులు అందుకున్న వందలాదిమంది పింఛనుదారులు ఉదయం నుంచే బారులు తీరారు. నడవలేని స్థితిలో కూడా తమ పింఛన్ల పునఃపరిశీలన కోసం మెట్లు ఎక్కి భవనంపైకి వెళ్లి వైద్యాధికారుల ఎదుట హాజరయ్యారు. అయితే పింఛన్ల కొనసాగింపునకు అటు దివ్యాంగులు, ఇటు వారి కుటుంబ సభ్యులు మండలంలోని కూటమి ప్రభుత్వ ముఖ్యనేతల చుట్టూ ప్రదక్షిణ చేసుకునేందుకు యత్నిస్తున్నారు. అయితే మరికొందరు తాము పింఛన్ వచ్చేలా చూస్తామని లాబీయింగ్ చేస్తుండడంపై పలువురు దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా 270 మంది దివ్యాంగులకు సంబంధించిన ధ్రువపత్రాలను, వారి వైకల్యాన్ని పరిశీలించి జాబితాను ఎంపీడీఓకు అందజేశారు. మంచానికే పరిమితమై రీవెరిఫికేషన్‌కు రాలేని దివ్యాంగులను వారి ఇంటికే వెళ్లి పరీక్షించనున్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్.. టెన్షన్

గుడిపాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం బొమ్మసముద్రం, పానాటూరు, మరకాల కుప్పం, తిమ్మయ్యపల్లె, నారగల్లు, ఏఎల్‌పురం, 197 రామాపురం నుంచి వచ్చిన 105 మంది దివ్యాంగులను బొమ్మసముద్రం డాక్టర్ రష్మిత రీవెరిఫికేషన్ నిర్వహించారు. వీరిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అయితే పింఛన్ ఎక్కడ రద్దవుతుందోనని దివ్యాంగులు డాక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్నామని.. ఇప్పుడు తమ పొట్ట కొట్టడం సరికాదని వాపోయారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఆమె దివ్యాంగులకు తెలిపారు.



గుడిపాల : రీవెరిఫికేషన్‌కు వచ్చిన దివ్యాంగులు

క్లుప్తంగా

నేడు బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు 11వ డివిజన్ చెన్నమ్మ గుడిపల్లె ఓంశక్తి అమ్మ ఆలయం వద్ద, అనంతరం 30వ డివిజన్ లాలూగార్డెన్‌లోని కన్నన్‌కళాశాల సమీపంలో, మధ్యాహ్నం 3 గంటలకు 8వ డివిజన్ వెంగళరావుకాలనీ అమ్మన్ ఆలయం వద్ద కార్యక్రమం ఉంటుందన్నారు. స్థానికులు, నాయకులు, కార్యకర్తలు హాజరావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని పట్టణ ట్రాన్స్‌కో ఏఈ దేవిప్రసన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఐటీసీఎల్ పెట్రోల్ బంక్ వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

అనుమానితులతో అప్రమత్తంగా ఉండాలి



యువతతో మాట్లాడుతున్న సిఐ శ్రీనివాసులు


బంగారుపాళెం: గ్రామాల్లో అనుమానితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐ కత్తి శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని టేకుమంద గ్రామంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బందితో కలసి కార్డెన్‌సెర్చ్ చేపట్టారు. గ్రామంలోని అనుమానాస్పద ప్రదేశాలు, సమస్యాత్మక ప్రాంతాలు, దుకాణాలు, ఇళ్లల్లో తనిఖీ చేశారు. గ్రామంలో వివాదాలు సృష్టించే వ్యక్తులు, రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్త పడాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తుల కదలికలను గుర్తించి తెలియజేయాలన్నారు. అలాగే స్టేషన్ ఆవరణలో శనివారం సాయంత్రం వినాయక చవితి ఉత్సవాల నిర్వహణలో భాగంగా పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. చవితి వేడుకలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పూతలపట్టు(యాదమరి): మండల పరిధిలోని బందార్లపల్లిలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికుల కథనం మేరకు.. చిత్తూరు–తిరుపతి రైల్వే మార్గంలో తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్లు చెప్పారు. ప్రయాణిస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి కింద పడి చనిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పూతలపట్టు సీఐ కృష్ణమోహన్, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న వారు మృతికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. మృతుడి శరీరంపై ఉన్న గాయాలను బట్టి ఆత్మహత్య చేసుకున్నాడా ? లేక ప్రమాదవశాత్తు జారి కింద పడి మృతి చెందాడా ? కోణంలో విచారిస్తున్నారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

మొక్కలే మానవాళికి జీవనాధారం



పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్, రెడ్‌క్రాస్ సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి విద్యార్థి మొక్కలు నాటడం అలవరచుకోవాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి అన్నారు. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో శనివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మొక్కలను నాటడంతో పాటు సంరక్షించాలన్నారు. విద్యార్థులు మొక్కల ప్రాధాన్యతను తెలుసుకోవాలని.. మొక్కలు మానవాళికి జీవనాధారం అనే విషయం గ్రహించాలన్నారు. ప్రతి విద్యార్థి తమవంతు బాధ్యతగా ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి సహదేవనాయుడు మాట్లాడుతూ ఏపీ క్లైమెట్ యాక్షన్ గ్రూప్ ప్రాజెక్టులో భాగంగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిరంతరం మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ అంశాలపై పట్టు కలిగి ఉండాలన్నారు. మొక్కలు ప్రాణకోటికి జీవనాధారమన్నారు. మొక్కల పెంపకంతో పర్యావరణం సమతుల్యత పెరిగి మానవ మనుగడకు ప్రాణాధారం అవుతుందన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ పరిపాలన అధికారి గోపి, సమన్వయకర్త చిరంజీవి, కళాశాల సమన్వయకర్త రామమూర్తి, కళాశాల యూత్ రెడ్‌క్రాస్ సమన్వయకర్త గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటినీ మోసం చేసిన చంద్రబాబు



క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న విజయానందరెడ్డి నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు అవి తీర్చకుండా ప్రతి ఇంటినీ మోసం చేశారని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక 44వ డివిజన్ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో నాయకులు అల్తాఫ్, మురగదాస్, నవాజ్, గౌస్, గఫార్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఎంతసేపూ వైఎస్సార్‌సీపీ నాయకులపై విమర్శలు తప్ప ఇచ్చిన హామీలను తీర్చాలనే ఆలోచనలో ప్రజాప్రతినిధులకు లేనట్లు కనిపిస్తోందన్నారు. నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్ మాట్లాడారు. గత పాలనలో విజయానందరెడ్డి కోట్లాది రూపాయలు చెల్లించి మార్కెట్‌గేటు, ప్రభుత్వ ఆస్పత్రి పార్కింగ్‌ను ఉచితం చేశారన్నారు. అలాగే కోవిడ్, వరదల సమయంలో నీవానది సమీప ప్రాంతవాసులకు సాయం అందించారన్నారు. డివిజన్ పరిధిలోని వీరభద్ర కాలనీలో కాలువలు లేక అవస్థ పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్యను చూడడమే తప్ప పరిష్కారం ఇంకా చూపడం లేదన్నారు. పలు ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదని, పిచ్చిమొక్కలు నివాసాల వద్ద పెరిగి విషపురుగులకు ఆవాసంగా మారిందన్నారు. చీకటి వేళ్లలో మందుబాబు, ఆకతాయిల ఆగడాలు శృతిమించుతోందన్నారు. డివిజన్ పరిధిలో ఇన్ని సమస్యలు ఉంటే అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోవడం లేదని విజయానందరెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో ఉద్యోగుల పెన్షనర్ల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయసింహారెడ్డి, నాయకులు ఆను, చాన్‌బాషా, నౌషద్, నవాజ్, మధురెడ్డి, నారాయణ, చామంతి, రాజేష్‌రెడ్డి, మురళీరెడ్డి, చక్రి, పిచ్చాండి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు సిద్ధమైన మహిళను..

– చాకచక్యంగా కాపాడిన యాదమరి ఎస్‌ఐ



పోలీసుల సంరక్షణలో బాధితురాలు

యాదమరి: కుటుంబ కలహాలతో ఓ వివాహిత తన మూడేళ్ల కుమారుడితో కలిసి రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను యాదమరి ఎస్‌ఐ ఈశ్వర్ చాకచక్యంగా మాట్లాడి రక్షించిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల కథనం మేరకు.. మండల పరిధిలోని రసూల్ నగర్‌కు చెందిన జబీర్ కుమార్తె నగీన(25) కుటుంబ కలహాలతో శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయిందన్నారు. అయితే సదరు మహిళ తాను తిరుపతిలోని రైల్వే ట్రాక్‌పై ఉన్నానని, ఆత్మహత్య చేసుకుంటున్నానని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. ఈ విషయాన్ని బాధిత మహిళ తండ్రి జబీర్ స్థానిక ఎస్‌ఐ ఈశ్వర్‌కు తెలిపారు. వెంటనే ఆయన మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా ఆమె ట్రాక్‌పై ఉన్నట్లు గుర్తించారు. ఆమెతో ఫోన్‌లో సంభాషిస్తూనే ఆమె మనసులో మనోధైర్యాన్ని కలిగిస్తూ తిరుపతి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారి సహకారతో ఆమె ఆత్మహత్యకు పాల్పడకుండా కాపాడి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా ఆమెను అప్పగించారు. తమ కుమార్తెను రక్షించడంపై జబీర్, కుటుంబ సభ్యులు ఎస్‌ఐ ఈశ్వర్‌కు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో వినాయకుణ్ణి కొలుద్దాం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): భక్తి శ్రద్ధలతో వినాయకున్ని కొలుద్దామని, చవితి మండపాల్లో నియమ నిబంధనలు పాటించాలని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు రామభద్ర కోరారు. శనివారం ఆయన చిత్తూరు నగరంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 27వ తేదీ వినాయక చవితికి అంతటా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అలాగే కట్టమంచి చెరువు వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. అక్కడ మాత్రమే వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు హరిప్రసాద్, షణ్ముగం, వెంకటేష్, జయచంద్ర, జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

చవితికి జాగ్రత్తలు పాటించండి

చిత్తూరు కార్పొరేషన్: వినాయక చవితి పండుగకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. విగ్రహాలను ట్రాక్టర్, ఇతర వాహనాలలో తీసుకెళ్లేటప్పుడు విద్యుత్ వైర్లు తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మండపాల వద్ద సీరియల్ లైట్స్, డెకరేషన్ ఐటమ్స్ వైర్లు కట్ అయ్యాయా లేదా అని చూసుకోవాలన్నారు. నిమజ్జన ఊరేగింపు సమయంలో విగ్రహాలకు వైర్లు తగలకుండా జాగ్రత్త పడాలని సూచించారు. మండపాలకు తాత్కాలిక సరఫరాను తీసుకోవాలని కోరారు.

షికారీల భూముల అభివృద్ధికి హామీ



షికారీలతో మాట్లాడుతున్న అధికారులు

యాదమరి: షికారికాలనీ వాసులకు చెందిన బీడు భూములను ఉపాధిహామీ పథకం ద్వారా అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఎంపీడీఓ వేణు, ఏపీఓ సంధ్యారాణి చెప్పారు. జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని కీనాటంపల్లి పంచాయతీలో ఆమె దత్తత తీసుకున్న షికారి కాలనీలో అన్ని శాఖల అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక, సామాజికంగా వెనుకబడిన షికారీలను అభివృద్ధిపథంలో నడిపించేందుకు అధికార యంత్రాంగం నడుం బిగించిందని తెలిపారు. అందులో భాగంగానే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో జీవనోపాధి కల్పించడానికి దాదాపు 40 కుటుంబాలకు జాబ్ కార్డులను అందించామని చెప్పారు. దశాబ్దాల కిందట తమకు మంజూరు చేసిన వ్యవసాయ భూములకు నీటి వసతి లేకపోవడంతో బీడుగా మారాయన్నారు. బోరు ఏర్పాటు చేస్తే వ్యవసాయం చేసుకుని బతుకుతామని కాలనీవాసులు అభ్యర్థించగా..ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఏపీఓ సంధ్యారాణి హామీ ఇచ్చారు. ఇంటి స్థలం కోసం లేఅవుట్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తహసీల్దార్ పార్థసారథి తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతినెలా మూడో శనివారం కాలనీలో వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం కాలనీలో శ్మశాన వాటిక కోసం స్థలం చూపించారు. షికారి కాలనీలోని 20 కుటుంబాలకు సబ్సిడీ కింద విద్యుత్ మీటర్లు అందజేస్తామని ట్రాన్స్‌కో అధికారులు వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న కైగల్ జలపాతం



బైరెడ్డిపల్లె: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని పర్యాటక ప్రాంతమైన కైగల్ జలపాతం పరవళ్లు తొక్కుతోంది. పలువురు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అక్కడికి చేరుకుని సంతోషంగా గడుపుతున్నారు. జలపాతం వద్దకు వెళ్లే రోడ్డు గుంతలు పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. కైగల్ జలపాతం వద్ద ప్రమాదం పొంచి ఉందని, పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



ప్రతిజ్ఞ చేయిస్తున్న చిత్తూరు మేయర్ అముద

చిత్తూరు అర్బన్: పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతతో విష జ్వరాలు, వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని చిత్తూరు మేయర్ అముద అన్నారు. 'స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం చిత్తూరు నగరపాలక పరిధిలో 'మాన్ సూన్ హైజీన్' అంశంపై ప్రత్యేక అవగాహన, ర్యాలీ, దోమల నియంత్రణ కార్యక్రమాలు నిర్వహించారు. లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో నగరంలో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంత రం ప్రతిజ్ఞ చేయించారు. చామంతిపురంలో అవగాహన ర్యాలీ, దోమల నియంత్రణ చర్యలు తీసుకున్నారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, సహాయ కమిషనర్ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి లోకేష్ కార్పొరేటర్ ఇందు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గుడిపాల: వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక వైద్యాధికారి సంధ్య తెలిపారు. శనివారం చెన్నసముద్రం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా జ్వరం ఆడ అనాఫిలస్ దోమకాటు ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఇది మంచి నీటిలో పెరిగి మలేరియా వ్యాధిని వ్యాప్తి చేస్తుందన్నారు. అనంతరం బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు గర్భిణులకు చికిత్స చేసి ఉచితంగా మందులు, మాత్రలను పంపిణీ చేశారు. ఇంటికే పరిమితమైన వారిని ఇంటి వద్దకు వెళ్లి వైద్యం అందజేశారు.

ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ వద్దు

తవణంపల్లె: ప్రజలు ఆరోగ్యం పట్ల అశ్రద్ధ చూపరాదని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. శనివారం మండలంలోని ద్వారకాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో జ్వరాలు సోకకుండా జాగ్రత్తగా ఉండాలని, అనంతరం గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు.



వైద్యం చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

వ్యాధులు ప్రబలకుండా అవగాహన

ఐరాల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్యసిబ్బందికి స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప ఆదేశించారు. శనివారం పీహెచ్‌సీలో స్వచ్ఛాంధ్ర– స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేసి 50 మొక్కలు నాటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దోమల నివారణకు యాంటీ లార్వా, ఫాగింగ్ చేపట్టాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.